షబ్బీర్ అలీకి సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖ, ప్రభుత్వ సలహాదారునిగా నియమితులైన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీమంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీని మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాదులోని ఆయన నివాసంలో శాలువాతో సన్మానించి పుష్పగుచ్చం అందజేశారు. ఈ కార్యక్రమంలో టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, ఎంపీపీ గాల్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, ఎంపీటీసీ మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు దయాకర్ రెడ్డి, నాయకులు సుధాకర్, లింగారెడ్డి, రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



షబ్బీర్‌అలీని సన్మానిస్తున్న నాయకులు

టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడులు

- మొరం తరలిస్తున్న జేసీబీ, టిప్పర్లు స్వాధీనం

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామ శివారులో ఆదివారం అర్థరాత్రి టాస్క్ ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. అక్రమంగా మొరం తరలిస్తున్న జేసిబి, రెండు టిప్పర్లు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని మాక్లూర్ పోలీస్ స్టేషన్లో అప్పగించారు. తనిఖీల్లో టాస్క్ ఫోర్స్ ఏసిపి రాజశేఖర్ రాజు, సిఐ అంజయ్య, అజయ్ బాబు, సిబ్బంది సుధాకర్, లక్ష్మణ్, నరసయ్య పాల్గొన్నారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న టిప్పర్



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎండిన పసుపు విక్రయించి
లాభాలు పొందండి

- రైతులకు వ్యవసాయ మార్కెట్ కమిటీ సూచన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎండిన పసుపు అమ్మి రైతులు మంచి లాభం పొందాలని నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రెటరీ వెంకటేశం సూచించారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పసుపు రైతులకు అవగాహన కల్పించుటకు ఉమ్మడి నిజామాబాద్, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటు చేసి ప్రచారానికి పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ మార్కెట్ యార్డులోకి పచ్చి పసుపును రైతు సోదరులు తీసుకరావద్దని, బాగ ఎండిన, శుభ్రం చేసిన పసుపును మాత్రమే అమ్మకానికి తీసుకొచ్చి మంచి పోటీ ధరను పొందగలని కోరారు. బాగ ఎండిన పసుపు తెచ్చిన రోజే అమ్ముకోవచ్చని, ఎక్కువ మంది వ్యాపారులు వాటిని కొనుగోలు చేసేందుకు పోటీ పడతారని తెలిపారు. దానికి మంచి ధర వచ్చును అని, దానితో పాటు తూకం చేయడం తేలిక, రవాణ చేయడం సులభం అవుతుంది అని, పచ్చి పసుపు తూకము ఎక్కువ వచ్చినా ధర తక్కువ వచ్చి నష్టం వచ్చును అని, ఎండిన పసుపు తూకం తక్కువ వచ్చినా ధర ఎక్కువ వచ్చి లాభం రానున్నట్టు తెలిపారు. మీరు తెచ్చిన పచ్చి పసుపు అదే రోజు అమ్మకం జరగనిచో త్వరగా ఫంగస్ సోకి పూర్తిగ వసుసు పాడైపోయి ధర తక్కువ వచ్చే అవకాశం ఉందని అన్నారు. అందువలన రైతులు నిజామాబాద్ మార్కెట్ యార్డుకు బాగా ఎండిన పసుపును మాత్రమే తీసుకువచ్చి అధిక ధర పొందాలని సూచించారు.



సిద్ధంగా ఉన్న ప్రచార రథాలు

'స్పెషల్' దోపిడీ

- నిబంధనలకు విరుద్ధంగా స్పెషల్ తరగతులు
- దానికోసం అదనంగా ఫీజు వసూలు
- ఒక్కో విద్యార్థి నుంచి రూ.5 నుంచి పదివేలు
- డబ్బుల కోసం పలు ప్రయివేటు స్కూళ్ల ఎత్తుగడ
- ముందస్తుగా సమాచారం ఇవ్వకుండానే వసూళ్లు
- పట్టించుకోని విద్యాశాఖ జిల్లా యంత్రాంగం

నవతెలంగాణ-కామారెడ్డి

పదో తరగతి ప్రతి విద్యార్థికి తమ ఉన్నత చదువులకు పునాదిగా భావిస్తుంటారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు పదో తరగతిలో ఉత్తమ మార్కులు రావాలని ఆశిస్తుంటారు. దీన్నే అదునుగా భావిస్తున్న పలు కార్పోరేట్, ప్రయివేటు పాఠశాలలు పదోతరగతి విద్యార్థులకు 'స్పెషల్' క్లాస్‌ల పేరిట డబ్బుల వసూలుకు ప్లాన్ రూపొందించారు. దీనిపై తల్లిదండ్రుల నుంచి వ్యతిరేక వ్యక్తమవకుండా ముందస్తుగా వారితో సమావేశం నిర్వహించి ఫీజు వివరాలు వెల్లడించకుండా అదనపు తరగతులు నిర్వహిస్తామని చెప్పి.. తర్వాత అదనంగా ఫీజు చెల్లించాలంటూ ఫోన్‌లకు మెసెజ్‌లు పంపుతుండటం గమనార్హం. ఇంత జరుగుతున్నా.. విద్యాశాఖాధికారులు మాత్రం 'మామూలు'గా తీసుకుంటున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

ఈ సంవత్సరం కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 11,960 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. మార్చి నెలలో పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు వెళ్లనున్నారు. అయితే ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళ అదనపు తరగతులు నిర్వహిస్తూ దాతల సాయంతో పిల్లలకు స్నాక్స్ పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే అందుకు పూర్తి విరుద్ధంగా పలు ప్రయివేటు, కార్పోరేట్ కళాశాలలు విద్యార్థుల భావి భవిష్యత్ కాకుండా తమ వ్యాపార దృక్పథంతో పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాస్‌ల పేరిట అదనపు దోపిడీకి తెరలేపాయి.

పలు ప్రైవేట్ విద్యా సంస్థలు నైట్ క్లాసుల (రాత్రి తరగతుల) పేరిట పాఠశాలలోనే విద్యార్థులను రాత్రి వరకు ఉంచుకోవడం తెల్లవారుజామున విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి పంపిస్తున్నారు. నైట్ క్లాసులు చెబుతున్నామని దీనికి అదనంగా ఫీజులు చెల్లించాలని కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు 5 వేల నుండి పదివేల రూపాయల వరకు వసూలు చేస్తున్నాయి.

ముందస్తు సమాచారంతో తనిఖీలు

గతంలో భిక్కనూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల వద్దనుండి అధిక ఫీజులకు పాల్పడితే విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయగా ఎలాంటి నైట్ క్లాసులు పెట్టడం లేదని, ఎవరి వద్ద అధిక ఫీజులు వసూలు చేయలేదని బుకాయించి పంపించారు. ఈ సంవత్సరం మరోసారి ప్రైవేట్ విద్యా సంస్థలు నైట్ క్లాసులు ఏర్పాటు చేసి ఫీజు దోపిడీకి పాల్పడుతున్నారు. అయితే అధికారులు తనిఖీలకు వచ్చే ముందు సదరు స్కూళ్లకు ముందస్తు సమాచారం ఇస్తున్నారని, దీంతో ఆయా స్కూళ్ల ఆయా రోజుల్లో తరగతులు నిర్వహించకుండా ఏమీ జరగడం లేదని చెప్పే ప్రయత్నం చేస్తున్నాయి.

ముందస్తుగా తల్లిదండ్రులకు అవగాహన

స్పెషల్ క్లాస్‌ల పట్ల తల్లిదండ్రుల ఫిర్యాదు చేయొద్దనే ఉద్దేశ్యంతో పలు స్కూల్లు ఈసారి ముందస్తుగా విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాయి. వారి వద్ద నుండి నైట్ క్లాసులకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఫీజుల విషయం మాట్లాడకుండానే సంతకాలు తీసుకున్నట్లు సమాచారం.

విద్యార్థుల తల్లిదండ్రులను నవతెలంగాణ వివరణ కోరగా పదవ తరగతి విద్యార్థులకు నైట్ క్లాసులు నిర్వహించడానికి ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసిన విషయం నిజమేనని కానీ సమావేశంలో ఫీజుల విషయం ఎలాంటి సమాచారం ఇవ్వలేదని తెలిపారు. సమావేశమైన రెండు రోజుల తర్వాత ఒక్కొక్కరికి ఫోన్ చేసి నైట్ క్లాసులకు 5000 రూపాయలు చెల్లించాలని తెలిపినట్లు తెలిపారు.

సమావేశం నిర్వహించిన సమయంలోనే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫీజుల గురించి పూర్తి వివరాలు తెలియజేయ కుండానే సమావేశం ఏర్పాటు చేసి సంతకాలు తీసుకుని విద్యాశాఖ అధికారుల నుండి ప్రైవేట్ విద్యా సంస్థలు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. సంక్రాంతి పండుగ సందర్భంలో కూడా ఎలాంటి క్లాసులు నిర్వహించరాదని విద్యాశాఖ ఆదేశాలు ఉన్నప్పటికీ పండుగ సమయంలో క్లాసులు నిర్వహించినట్లు సమాచారం.

జిల్లాలో ప్రైవేట్ విద్యా సంస్థలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న, నియమ నిబంధనలు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్న, రాత్రి వరకు విద్యార్థులను నైట్ క్లాసుల పేరిట ఇబ్బందులకు గురి చేస్తూ తెల్లవారుజామున నాలుగు గంటల వరకు విద్యార్థులను నిద్రలేపి చదువులు చెబుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు కోరుచున్నారు.



ఫైల్

గణతంత్ర దినోత్సవ వేడుకలకు
పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రిపబ్లిక్ డే సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యానవన, జిల్లా గ్రామీణాభివృద్ధి, పశు సంవర్ధక, విద్య, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, ఫిషరీస్, రాష్ట్ర రోడ్డు రవాణా తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా పరిమితితో కూడిన ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో సమర్ధవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందికి ప్రాధాన్యతనిస్తూ, ఈ నెల 24 వ తేదీ మధ్యాహ్నం లోపు వారి పేర్లను ప్రతిపాదనల రూపంలో సిఫార్సు చేయాలని అధికారులకు సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. జిల్లా సంక్షేమ శాఖతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో లబ్దిదారులకు ఆస్తులు, దివ్యంగులకు బ్యాటరీ వెహికల్స్, ఇతర ఉపకరణాల పంపిణీ కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, అదనపు డీసీపీలు జయరాం, గిరిరాజు, జెడ్పి సీఈఓ గోవింద్, డీఆర్డీఓ చందర్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శన ఫలితాలు విడుదల

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాస్థాయి రాష్ట్ర బాల్ వైజ్ఞానిక ప్రదర్శన 2023 ఫలితాలను కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం విడుదల చేశారు. ఐదు విభాగాలలో జూనియర్, సీనియర్ మొత్తం 165 ప్రాజెక్టులను ఆన్‌లైన్‌లో ప్రదర్శించినట్టు తెలిపారు. ఇందులో నుండి రాష్ట్రానికి ఐదు విభాగాలలో ఒక్కొక్క విభాగం నుండి జూనియర్, సీనియర్ విభాగం నుండి ఒక ప్రాజెక్టు ఎంపిక చేశారు. టీచర్ ఎగ్జిబిట్ నుండి ఒకరు, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సైన్స్ సెమినార్ నుండి ఒక విద్యార్థిని రాష్ట్ర స్థాయిలో జరిగే ఆన్లైన్ ప్రదర్శనకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థుల ప్రాజెక్టు వివరాలను ఎస్‌సీఈఆర్‌టీ వారు సూచించిన వెబ్‌సైట్‌లో నమోదు చేయవలసిందిగా తెలియజేస్తూ ఎంపికైన విద్యార్థులకు జిల్లా తరపున శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర, జాతీయస్థాయిలో చక్కటి ప్రతిభను కనపర్చి అత్యుత్తమ ఫలితాలను సాధించాలని విద్యార్థులను కలెక్టర్ సూచించారు. ఇతరాత్ర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఎం సిద్ధిరాం రెడ్డిని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాం రెడ్డి పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న కలెక్టర్

ప్రజావాణి ఫిర్యాదులను
సత్వరమే పరిష్కరించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 39 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, జెడ్పి సీఈఓ గోవింద్, డీఆర్డీఓ చందర్, డీపీఓ జయసుధ, ఆర్డీఓ రాజేంద్ర కుమార్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం తెలియజేస్తూ, ప్రజావాణి సైట్‌లో పూర్తి వివరాలు అప్లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.





దరఖాస్తుల స్వీకరణ అనంతరం అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి : అడిషనల్ కలెక్టర్

కామారెడ్డి : ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను అధికారులు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన ఫిర్యాదులను, వినతులను ప్రజల నుంచి జిల్లా అదనపు కలెక్టర్ స్వీకరించారు. ఆర్జీలను సంబంధిత శాఖ అధికారులకు అదనపు కలెక్టర్ సిఫారసు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడతూ జిల్లా కేంద్రంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వ్యయప్రయాసల కోర్చి వస్తున్న ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఫిర్యాదులను శాఖల వారీగా స్వీకరించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలన్నారు. ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 13, జిల్లా పంచాయతీ అధికారికి ఆరు, జిల్లా విద్యాశాఖ అధికారి కి రెండు, జిల్లా భూమి కొలతల కార్యాలయం, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి, మునిసిపల్, హౌసింగ్, ఎక్సైజ్‌శాఖ, మిషన్ భగీరథ తదితర శాఖలకు ఒక్కొక్క ఫిర్యాదు చొప్పున మొత్తం 27 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, డి ఆర్ డి ఓ సాయన్న, కలెక్టరేట్ లోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



కామారెడ్డిలో వినతులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్

పెద్దగుట్టలో ఉర్సు షురూ..

- సందల్ ఎత్తుకొన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-వర్ని

కులమతాలకతీతంగా పేరుగాంచిన పెద్దగుట్ట(బడా పహాడ్) ఉర్సు వేడుకలు సోమవారం నుంచి ప్రారంభమైయ్యాయి. నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలోని జలాల్‌పూర్ సమీపంలోని బడాపహాడ్‌లో మూడు రోజుల పాటు జరగనున్నాయి. ఉర్సు వేడుకలను సోమవారం మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. హజ్రత్ సయ్యద్ షాదుల్లా ఉత్సవాలను ప్రజలు ప్రేమ, సంతోషలతో మధ్య జరుపుకోవాలని సూచించారు.

ముందుగా జాలాల్ పూర్ గ్రామ మొల్ల జమాల్ సాబ్ ఇంటి నుంచి సందల్‌లను మజీద్ వద్దకు మొల్ల తీసుకొచ్చారు. తదుపరి మజీద్ వద్ద సందల్‌కు ప్రవక్తలు ప్రార్థనలు చేసి ఉన్నారు. కవ్వాలి పాటలు, ఫకీర్ల విన్యాసాతో పాటు భక్తులు ఒంటె కాళ్ళ కింద నుంచి దూరుతు, గుర్రం పాదాలను పాలతో అభిషేకించి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. అనంతరం మాజీ స్పీకర్ పోచారం సందల్‌ను తలపై ఎత్తుకొని మొల్లకు ఇవ్వటంతో వారు ఒంటెపై ఊరేగింపుగా సందర్శకుల ఆట, పాటలతో పెద్దగుట్ట హజ్రత్ సయ్యద్ షాదుల్లా హుస్సేన్ బాబా దర్గా వరకు తీసుకెళ్లారు. 24వ తేదీ వరకు ఈ ఉత్సావాలు కొనసాగుతాయని వక్ఫ్ బోర్డు అధికారులు తెలిపారు. ఈ ఉత్సావాలలో డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, సర్పంచ్ అనిత వెంకట్ గౌడ్, జడ్పీటీసీ హరిదాస్, మండల అధ్యక్షులు గిరి, కార్యదర్శి వెలగపూడి గోపాల్, కో ఆపెసన్ ఖరీం, పిఏసిఎస్ చైర్మన్ కష్ణ రెడ్డి, రంజ్యా నాయక్, మాజీ ఎంపీటీసీ, పలు గ్రామాల సర్పంచ్‌లు, భక్తులు పాల్గొన్నారు.



ఉర్సులో సందల్ ఎత్తుకున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

పథకాలను అర్హులు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచ్ సక్కారం అశోక్ అధ్యక్షతన వియసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా గ్రామ సభను నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టి అమలుపరుస్తున్న అన్ని పథకాలపై అధికారులు గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ.....కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా చూడాలని అధికారులను కోరారు. కేంద్రం నుండి అందించే సంక్షేమ పథకాలు పొందాలంటే ఆయా శాఖకు సంబంధించి వివరాలను గ్రామ కార్యదర్శిని సంప్రదించి అర్హులైన వారందరూ దరకాస్తు చేసుకొని లబ్ధి పొంది ఆర్థికంగా నిలదొక్కు కావాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసిల్దార్ ఆంజనేయులు, మండల పంచాయతీ అధికారి సదాశివ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శరత్, వ్యవసాయ విస్తీర్ణ అధికారి పద్మ, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ బ్రాంచి మేనేజర్ నవీన్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, చౌట్ పల్లి ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు సత్యనారాయణ, ఆరోగ్య శ్రీ ముత్తెన్న, ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపసర్పంచ్ విక్రమ్, వార్డు సభ్యులు నీలిమ, గిరిజ, లావణ్య, శారద, విజయ, వివిధ శాఖల మండల, గ్రామస్థాయి అధికారులు,ఐకెపి సిసి భాగ్య, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, విఓఏ లు, నాయకులు, మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లల్లోనే
ఉత్తమ ఉపాధ్యాయులు

ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

విద్యార్థి జీవితం మరువలేనిదని రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా చదువుతేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. తాము చిన్నప్పుడు మెటీరియల్ బుక్స్ అందుబాటులో ఉండేవి కావని, కానీ ఇప్పుడు అన్ని రకాల వసతులు ఉన్నప్పటికిని విద్యార్థులు ప్రతిభ కనబరచడంలో కొంతమంది మాత్రమే ముందంజలో ఉంటున్నారని తెలిపారు. కాబట్టి వనరుల సద్వినియోగం పరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తమ శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. వారిని సద్వినియోగం చేసుకొని తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాడ్వాయి శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని స్థాయిల్లో పరీక్షలు నిర్వహించి రానున్న రోజుల్లో విద్యార్థులు ప్రవేశ పరీక్షలు రాయడానికి సన్నద్ధం చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. సమయపాలన, ప్రణాళిక ఉంటే సాధించడం చాలా సులభం అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ తాడ్వాయి శ్రీనివాస్, నీలం లింగం, గంగ కిషన్, జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి రామారావు, కోశాధికారి నరేందర్, స్వప్న ,సుష్మ ,మమత, తదితరులు పాల్గొన్నారు.



గణిత ప్రతిభా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

సైక్లింగ్ చేసిన విద్యార్థినికి ఎస్పీ సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి

హైదరా బాద్ సైక్లింగ్ గ్రూపులో కామారెడ్డి విద్యార్థిని పాల్గొనగా ఆ విద్యార్థిని సోమవారం జిల్లా ఎస్పీ సన్మానించారు. హైదరాబాద్ సైక్లింగ్ గ్రూపు ఆధ్వర్యంలో 13 మంది సభ్యులతో కలిసి ఫిట్నెస్ పై అవగాహన కల్పించడానికి కార్గిల్ నుండి కన్యాకుమారి వరకు 3890 కిలో మీటర్లు 23 రోజుల్లో సైక్లింగ్ పూర్తి చేశారు. ఆ 13 మంది సభ్యులలో ఒకరు కామారెడ్డి జిల్లా సాందీపని జూనియర్ కాలేజ్ లో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సోమార్పేట్ గ్రామానికి చెందిన కుమరి బానోత్ వెన్నెల సైకలింగ్‌లో పాల్గొన్నారు. విద్యార్థిని కుమారి బానోత్ వెన్నెలను జిల్లా ఎస్పీ సి.హెచ్. సింధు శర్మ ఐపీఎస్, ట్రైనింగ్ ఐపీఎస్ కాజల్ సింగ్ అభినందించి మెమొంటోతో సత్కరించారు.



విద్యార్థినికి మెమోంటో అదజేస్తున్న ఎస్పీ

నవతెలంగాణ
నిజామాబాద్
మంగళవారం | జనవరి 23, 2024 | www.navatelangana.com

కర సేవకులకు సన్మానం


కర సేవకులను సన్మానించిన సభ్యులు

నవతెలంగాణ-ఏర్గట్ల

అయోధ్యలో శ్రీరాముని ఆలయ నిర్మాణంకోసం గుమ్మిర్యాల్ గ్రామం నుండి 1992లో కరసేవ కార్యక్రమంలో పాల్గొన్న ఆనాటి కరసేవకులు శ్రీరాముల సుదర్శన్, నరాల నడిపి రాజన్న, జంగ లింబాద్రి, నేరెళ్ళ గంగారెడ్డిని శ్రీ రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా గుమ్మిర్యాల్ శ్రీ రామ సేవా సమితి సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సోమరాజారెడ్డి, ఉపసర్పంచ్ సంజీవ్ యాదవ్, ఎంపీటీసీ బొల్లి శంకర్,శ్రీ రామ సేవా సమితి సభ్యులు, గ్రామకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మోపాల్

మోపాల్ మండలంలోని కంజర్ గ్రామంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎస్సీ ఎస్టీ, బీసీ, సాధారణ గురుకుల విద్యాలయాల్లో 2024- 2025 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ప్రవేశ పరీక్షకోసం విద్యార్థుల నుంచి ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ జి. మాధవి లత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రులు ఆదాయం లక్షా50వేల లోపు ఉండాలని, అలాగే పట్టణంలోగల విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం రెండు లక్షల లోపు ఉండాలని తెలిపారు. ఫిబ్రవరి 11న ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఉంటుందని విద్యార్థులు 100 రూపాయల రుసుం చెల్లించి ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. 2023- 24 విద్యా సంవత్సరం ప్రభుత్వ లేదా ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నవారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు www.tswreis.telangana.gov. అనే వెబ్సైట్ ద్వారా ప్రవేశ పరీక్ష కోసం ఈనెల 23లోపు పేర్లను నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

షబ్బీర్ అలీని సన్మానించి నాయకులు



నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖ సలహాదారుడిగా షబ్బీర్ అలీ నియామకమైన సందర్భంగా నిజామాబాద్ పట్టణ నాయకులు ఆకుల లలిత, కేశవేణు, నరాల రత్నాకర్, గడిల రాములు, ఆకుల రాఘవేందర్ తదితరులు షబ్బీర్ అలీని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అన్నదానాలు

- ఎల్ఈడీలద్వారా బాలరాముని ప్రాణపతిష్ట ప్రసారాలు
- ఉత్సవ ర్యాలీలు

నవతెలంగాణ-విలేకరులు

కంఠేశ్వర్: అయోధ్య బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా నగరంలోని ప్రాచీన ఆలయం ఖిల్లా రామయంలో ప్రత్యేక పూజలు సోమవారం నిర్వహించారు. అనంతరం నిజామాబాద్ నగర మేయర్ దంపతులు దండు నీతూ కిరణ్ శేఖర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. భక్తుల చిరకాల కోరిక రామజన్మ భూమి అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా ఖిల్లా రామాలయం, జెండా బాలాజీ ఆలయం గోల్ హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఆర్ఆర్ చౌరస్తాలోని హనుమాన్ ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మేయర్‌తో నుడా డైరెక్టర్ రాజేంద్ర ప్రసాద్, అనిల్, ఆలయాల చైర్మన్లు జాలిగాం గోపాల్, నీలగిరి రాజు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్: పట్టణంలోని స్మైల్ స్కూల్, జెంటిల్ కిడ్స్ పాఠశాలల్లో సోమవారం అయోధ్యలోని రామాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పండుగ వాతావరణం ఏర్పడింది. పిల్లలందరూ అభినందనలు తెలుపుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు. ఈ కార్యక్రమం నిర్వహించినందుకు తల్లిదండ్రులందరూ మేనేజ్మెంట్‌కు అభినందనలు తెలిపారు. వందల సంవత్సరాల కల ఇవ్వాళ నిర్వహించిందని పేరెంట్స్ తల్లిదండ్రులు, టీచర్స్ స్టూడెంట్స్ అందరూ సంతోషంగా సంతోషం వ్యక్తం చేశారు కరస్పాండెంట్ షబానా గోహర్, డైరెక్టర్ రఫీ గోహర్ ఈ సందర్భంగా అందరికి అభినందనలు తెలిపారు. జెంటిల్ కిడ్స్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో కరస్పాండెంట్ గుజరాతి ప్రకాష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పట్టణంతోపాటు గ్రామాల్లోని ఆలయాల్లోనూ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వర్ష అపార్ట్మెంట్‌లో కె సంధ్యారాణి అనే గృహిణి ముగ్గు వేసి ఆధ్యాత్మికతను చాటుకోవడం పలువురిని ఆకట్టుకుంది.

మాక్లూర్: మండలంలోని పలుగ్రామాల్లో అయోధ్యలో శ్రీరామ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. రామాలయాల వద్ద అన్నదానం నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో శోభయాత్రను చేపట్టారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి బోర్గం (కె) గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు, గ్రామ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ఏర్గట్ల: ఏర్గట్ల, గుమ్మిర్యాల్ గ్రామాల్లో శ్రీ రామ కమిటీ సభ్యులు శ్రీ బాలరాముని ప్రాణప్రతిష్ఠను ఎల్ఈడి ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయగా భక్తులు తిలకించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, ఎంపీటీసీలు జక్కని మధుసూదన్, బొల్లి శంకర్, గుమ్మిర్యాల్ సర్పంచ్ సోమ రాజారెడ్డి, ఉపసర్పంచ్ సంజీవ్ యాదవ్, గ్రామకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: అయోధ్య రామ మందిరంలో సోమవారం బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో అన్నసంతర్పణ కార్యక్రమాలను నిర్వహించారు. పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున ఉత్సవ ర్యాలీలను నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయంలో పూజ కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

ఆర్మూర్: అయోధ్య బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి స్వగ్రామం అంకాపూర్‌లో సిద్ధుల గుట్ట ఆలయంలో కుటుంబ సమేతంగా రామాలయంలో పూజలో పాల్గొన్నారు. పల్లకి సేవ లో పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని మామిడి పల్లిలో రాముని అభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇస్సపల్లి, అలుర్,వన్నెల,సిద్దపుర్, వెల్మల్, బోర్గం గ్రామాల్లోని ఆలయాల్లో ఎమ్మెల్యే పూజ ల్లో పాల్గొన్నారు కార్యక్రమంలో అసెంబ్లి కన్వీనర్ పెర్కిట్ పలేపు రాజు, ఆలూర్ మండల అధ్యక్షుడు గిరీష్,తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో....

పట్టణంలోని మామిడిపల్లి ఆల్ఫోర్స్ నరేంద్ర పాఠశాలలో, క్షత్రియ పాఠశాలలో, గాంధీనగర్, ఆక్స్‌ఫర్డ్ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సిరికొండ: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జరిగిన బాల రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండల కేంద్రంలో లొంక రామేశ్వర స్వామి ఆలయం నుండి అంగడి బజార్ వరకు పల్లకి సేవ నిర్వహించారు. అయోధ్యలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తులు ప్రత్యక్ష ప్రసారం వీక్షించేలా భారీ ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. అన్నదానం నిర్వహించారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని చింతలూరు గ్రామంలో ప్రతి ఇంటికి సీతారాముల చిత్రపటాన్ని పంపిణీ చేసినట్లు కొలి ప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్ తెలిపారు. అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని చింతలూరు గ్రామంలోని హనుమాన్ టెంపుల్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రఘువీర్ గౌడ్, బాలకృష్ణ, లింబాద్రి, చింటూ కలిసి ప్రతి ఇంటికి సీతారాముల చిత్రపటాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొలిప్యాక్ సింగిల్ విండో చైర్మన్ నాగుల శ్రీనివాస్, ఉప సర్పంచ్ జలంధర్, ప్రసాద్, తిరుపతిరెడ్డి, అభిలాష్, చిన్నారెడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నవీపేట్: మండల కేంద్రంలోని రామాలయంతోపాటు హనుమాన్, మార్కండేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. అయోధ్య రామాలయ విగ్రహ ప్రతిష్టాపన ప్రత్యక్ష ప్రసారాన్ని స్థానిక మార్కండేయ మందిరంతోపాటు పోతంగల్ శివాలయంలో నిర్వహించారు. టపాకాయలు పేల్చి సంబరాలు చేసుకున్నారు.

ముప్కాల్: మండల కేంద్రంతో పాటు మండలంలోని రెంజర్ల, కొత్తపల్లి, వేంపల్లి, నల్లూర్, నాగంపేట్, వెంచిర్యాల గ్రామాల్లో శ్రీరాముని సేవలో గ్రామస్తులు నిమగ్నమయ్యారు. మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో భక్తుల సౌకర్యార్థం ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆకర్షించిన అయోధ్య ఆలయ రంగవల్లి

నవీపేట్: అయోధ్య రామాలయంలో బాల రాముడి విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా మహిళలు, యువతులు ఆలయ నమూనా రంగవల్లులతో సోమవారం ప్రదర్శించారు. మండల కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీలో ఓడ్ కుల మహిళలు, యువతులు, శ్రీ అయోధ్య రామాలయం ఆలయ రంగవల్లి చూపరులకు ఎంతగానో ఆకర్షించింది. అనంతరం అయోధ్య రామాలయ పూజిత అక్షింతలతో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.


నవీపేట్‌లో ముగ్గు వేస్తున్న మహిళలు


ఆర్మూర్: పూజలు చేస్తున్న ఎమ్మెల్యే


కంఠేశ్వర్‌లో...


ఏర్గట్లలో...


కమ్మర్‌పల్లిలో...

అనుమతిలేని ఆల్‌ఫోర్స్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవద్దు


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆల్‌ఫోర్స్ జూనియర్ కళాశాలకు నిజామాబాద్‌లో అనుమతులు లేవని, నిర్మాణ దశలో ఉన్న కమర్షియల్ బిల్డింగ్‌లో విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మోసం చేస్తున్న ఆల్ ఫోర్స్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ..

నిజామాబాద్ ముబారక్ నగర్, వినాయక్‌నగర్‌లో కమర్షియల్ భవనాలను చూపిస్తూ అదే ఆల్‌ఫోర్స్ జూనియర్ కళాశాల తప్పుడు ప్రచారం చేస్తూ రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద తప్పుడు ర్యాంకుల హోర్డింగులు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలకు అనుమతులు ఉన్నాయని చెప్పి అబద్ధపు ప్రచారాలు చేస్తున్నటువంటి మేనేజ్మెంట్ పైన చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందించి అడ్మిషన్లు జరగకుండా చూడాలని, విద్యార్థులు తల్లిదండ్రులను మోసం చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే రేపటినుండి జిల్లా వ్యాప్తంగా విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, టీవీయూవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ లాల్ సింగ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం, జీవీఎస్ జిల్లా అధ్యక్షులు జైత్రాం రాథోడ్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అంజలి,టీఎస్ ఎఫ్ నాయకుడు మహేష్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేష్, సహాయ కార్యదర్శి సందీప్ పాల్గొన్నారు.

ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి కుటుంబానికి పరామర్శ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు

నవతెలంగాణ-నవీపేట్

మండలంలోని జన్నేపల్లి గ్రామానికి చెందిన ఎయిర్ ఫోర్స్ ఉద్యోగి పాతూరి రవిచంద్ర (33) ప్రమాదవశాత్తు రైలు కిందపడి మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పలువురు సోమవారం పరామర్శించారు. జమ్మూ కాశ్మీర్ ఎయిర్ ఫోర్సులో ఉద్యోగం చేస్తున్నారు. భార్య పిల్లలు ఆంధ్రప్రదేశ్ పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు వెళ్లడంతో సికింద్రాబాద్ నుండి రైలులో కాకినాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో పిడుగురాళ్ల వద్ద శుక్రవారం ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. కాగా ఆయన కుటుంబాన్ని బిజెపి నాయకులు ముప్వ నాగేశ్వరరావు, వంశీ మోహన్, వ్యాపారవేత్త మోహన్ రావు, బుల్లి రాజు, పూర్ణచందర్ రావు పరామర్శించి చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ


చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని కొత్తపల్లి గ్రామంలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మండల ప్రజాప్రతినిధులు, జిల్లా రజక సంఘ ప్రతినిధులు కలిసి ఆవిష్కరించారు.. ఈ సందర్భంగా జిల్లా రజక సంఘ ఐక్య వేదిక అధ్యక్షులు మాట్లాడుతూ వీరనారి చాకలి ఐలమ్మ పోరాటాలను ఈ తరం నాటి మన రజక సంఘం నాయకులు, యువకులు, మహిళలు తెలుసుకోవాలని అన్నారు. ఆమె చేసిన సేవలను, పోరాటాల స్ఫూర్తిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సామ పద్మ, జడ్పీటీసీ సభ్యులు బద్దం నర్సవ్వ, ఎంపీటీసీ సభ్యులు జోషి వెంకట్ రాజ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి, పార్టీ నాయకులు సామ వెంకట్ రెడ్డి, బద్దం నర్సారెడ్డి, రజక సంఘం ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు గూపన్ పల్లి శంకర్, సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలు జి.రమాదేవి, రాష్ట్ర కన్వీనర్ మానస గణేష్, ప్రధాన కార్యదర్శి ఫతేపూర్ నరేష్, నియోజకవర్గ ఇంచార్జ్ యానంపల్లి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల గోస ప్రభుత్వాలకు పట్టదా..?



మాట్లాడుతున్న ఏఐటీయుసి నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల గోస ప్రభుత్వాలకు పట్టదా...? అని ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ అన్నారు. సోమవారం నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జనరల్ బాడీ సమావేశం పి.సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల గోసను ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని అన్నారు. కరోనా సమయంలో ప్రజలకు చేసిన సేవలు మర్చిపోలేనివని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో టెండర్ ప్రక్రియ ద్వారా పనిచేస్తున్న కార్మికులకు గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 60 ప్రకారం.. 15,600 రూపాయల వేతనం ఇవ్వకుండా కాలయాపన చేసిందని, ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వెంటనే జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించడంతోపాటు సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని దీంతోపాటు జాతీయ పండగ, ఆర్జిత సెలవులు కార్మికులందరికీ వర్తింపజేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరుతున్నామ న్నారు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి లో పనిచేస్తున్న కార్మికులందరికీ పని భారాన్ని తగ్గించాలని, నిజామాబాద్ ఆసుపత్రిని 1000 పడకలకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వా న్ని కోరుతున్నామని అన్నారు. యూనియన్ రాష్ట్ర ఉప ప్ర ధాన కార్యదర్శి హసీనా బేగం, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వై భూమయ్య ఓ మయ్య మాట్లాడారు. సమావేశంలో యూనియన్ నాయకులు హైమది, భాగ్యలక్ష్మి, కవిత, నరసయ్య, శంకర్, ముత్యం, కార్మికులు పాల్గొన్నారు.

రావుట్లలో ఎమ్మెల్యే పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని రావుట్ల గ్రామంలో గాడిమాకుల రాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి సతీమణి వినోదిని మొక్కులు చెల్లించుకున్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మొక్కులు చెల్లిస్తానని రాజరాజేశ్వర స్వామికి మొక్కుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చినందున ప్రత్యేక పూజలు నిర్వహించినట్టు తెలిపారు. గ్రామస్థులు, వీడీసీ సభ్యులు మర్యాదపూర్వకంగా వారి ఇరువురిని సన్మానించారు. అనంతరం అయోధ్య లో జరిగిన రాముని ప్రాణ ప్రతిష్ఠ లో భాగంగా గ్రామాల్లో జరిగిన ఉత్సవాల్లో ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతు ఆరుగ్యారెంటీలు ఖచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని, ప్రజలు తెలిపిన సమస్యలను విడతల వారిగా నెరవేరుస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, ఎర్రన్న, మండల అధ్యక్షుడు బాకారం రవి , ఉమ్మాజి నరేష్,ఆసిఫ్, రమేష్, గంగారెడ్డి, ప్రసాద్, సామెల్, శివాజీ నాయక్, గోవర్ధన్, సంతోష్ గౌడ్, సంతోష్ రెడ్డి, దేగం సంజీవ్, శోభన్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మర్చిపోలేని గాయం.. తలారి సత్యం హత్య

- ఎమ్మెల్యే, ప్రజాపంథా రాష్ట్ర నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్

మరిచిపోలేని గాయం తలారి సత్యం హత్య అని, హత్యపై విచారణకు ప్రభుత్వాన్ని కోరుతామని మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డికి శిక్ష పడే వరకు పోరాటం చేస్తామని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, ప్రజాపంథా రాష్ట్ర నాయకులు వి.ప్రభాకర్ అన్నారు. వారి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఒక్కటై పోరాడుతామని, రాజకీయ పార్టీలు ప్రజాసంఘాల జేఏసీ నాయకులు పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. దళిత యువకులైన విద్యావంతులైన తలారి సత్యం చేపూరు రవీల 8 వ వర్ధంతి సందర్భంగా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే, ప్రజా పందా నాయకులు మాట్లాడుతూ.. దళిత యువకులు అయిన తలారి సత్యం, చేపూర్‌రవి ప్రశ్నించే గొంతులను తొక్కి వేయాలని ఒక అహంకార భావంతో అప్పటి ఎమ్మెల్యే వారిని హత్యచేశారని, నేటికీ ఎనిమిది సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు కూడా ఆ హత్యలు దోస్తులు శిక్ష పడకపోవడం బాధాకరమని అన్నారు. తలారి సత్యానికి అండగా వారి కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు పోరాడుతామని వారు అన్నారు. విచారణ చేయించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పోరాడుతున్న ఇప్పటివరకు కూడా ఎలాంటి న్యాయం జరగకపోవడం బాధాకరమని, ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ విషయంపైన అవగాహన ఉందని వారు చొరవ తీసుకోవాలని అన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి బి, దేవారాం, సబ్ డివిజన్ కార్యదర్శి బి. కిషన్ మరియు పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ స్టేట్ కన్వీనర్ దేగం ప్రమోద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, టిడిపి నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు దేగం యాదాగౌడ్, సిపిఐ నాయకులు ఆరేపల్లి సాయిలు, అంబేద్కర్ సంఘం నాయకులు, జేఏసీ అధ్యక్షులు సావెల్ గంగాధర్, ఎంఆర్‌పి ఎస్ జిల్లా అధ్యక్షులు కనక ప్రమోద్ మాదిగ, ప్రజాసంఘాల నాయకులు, ఉద్యమ పార్టీల సానుభూతిపరులు హాజరై, తలారి సత్యం కు న్యాయం జరిగేంత వరకు పోరాడతామని అన్నారు. తలారి సత్యం ది కుట్రపూరిత హత్యేనని దానికి కారణమైన మాజీ ఎమ్మెల్యే పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. తలారి సత్యంకు న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటామని , హత్యపై పూర్తిగా అవగాహన ఉన్న వ్యక్తి ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని వారు కూడా ఈ ఘటనపై విచారణకు ఆదేశించాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రెంజర్ల పాఠశాలలో స్వయంపాలనా దినోత్సవం

నవతెలంగాణ-ముప్కాల్

మండలంలోని రెంజర్ల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించిన విద్యార్థులతో ఫొటో సెషన్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జక్కుల రవి కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-రాజంపేట్

మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా కొప్పుల నరేష్, ఉపాధ్యక్షులుగా పుట్ట గణేష్, పందుల స్వామి, కార్యదర్శిగా మాణిక్య నాగరాజు, కోశాధికారిగా పిట్ల స్వామి, ప్రచార కార్యదర్శిగా బండారి సాయిలు, సలహాదారులుగా తొడెన్గల మల్లేశం, గుర్రాల గంగరాజు, పెద్దమ్మల కుమార్, గజ్జెలు భూపతిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కొప్పుల నరేష్ మాట్లాడుతూ.. తనపై ఎంతో నమ్మకంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంఘం సభ్యులకు కతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పేద ప్రజల గొంతుక.. నవతెలంగాణ

నవతెలంగాణ-నిజాంసాగర్

పేద ప్రజల గొంతుక.. నవతెలంగాణ దినపత్రిక అని తహసీల్దార్ బిక్షపతి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నవతెలంగాణ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నవతెలంగాణ దినపత్రిక పేద ప్రజలకు అవసరమైన సమాచారాన్ని చేరవేస్తూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు అధికారులకు దృష్టికి తీసుకొస్తుందన్నారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు మరిన్ని కథనాలు రాయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.అంజయ్య, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ



కామారెడ్డి: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



బిచ్కుందలో...



నాగిరెడ్డిపేటలో...



రెంజల్‌లో...

ఊరూరా శ్రీరామ ఉత్సవాలు

● **ఘనంగా అన్నదానాలు**

నవతెలంగాణ-విలేకరుల బృందం

అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని అన్ని గ్రామాల్లో సోమవారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాముడి చిత్రపటానికి ఊరేగించారు. పెద్దఎత్తున అన్నదానం చేపట్టారు.

రామారెడ్డి: మండలంలోని మద్దికుంట, రామారెడ్డి, కన్నాపూర్, మోషన్‌పూర్, పోసానిపేట్‌తో పాటు ఆయా గ్రామాల్లో, అయోధ్యలో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా ఉత్సవాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సీతారారాముల చిత్రపటాలను ఊరేగించారు. సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

లింగంపేట్: మండలంలోని ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

కోటగిరి: మండల కేంద్రంతో పాటు పలుచోట్ల రామాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

కామారెడ్డి గంజి రామాలయం పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే..

కామారెడ్డి: కామారెడ్డి గంజి రామాలయ పూజలో కామారెడ్డి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అయోధ్యలో శ్రీ బాల రాముని ప్రాణ ప్రతిష్ట సందర్భంగా కామారెడ్డి జిల్లా కేంద్రంలో గంజిలో గల రామాలయంలో నిర్వహించిన పూజ కార్యక్రమానికి కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

కరసేవలో పాల్గొన్న ముగ్గురికి సన్మానం..

రెంజల్: మండలంలోని వీరన్నగుట్ట గ్రామానికి చెందిన ముగ్గురిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 1992 డిసెంబర్‌లో వీరన్నగుట్ట గ్రామం నుంచి మిద్దె రమేష్ గౌడ్, నర్సాగౌడ్, పోచమల్లును శాలువా కప్పి పూలదండలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైండ్ల రాజు, భూమేష్, ఆలయ కమిటీ చైర్మన్ సిరవేణి శంకర్, కార్యదర్శి మధుకర్, మిద్దె శంకర్‌గౌడ్, గుంజే గంగాధర్, సందీప్ గౌడ్, రాయనర్స్, చిన్ను తదితరులు పాల్గొన్నారు.

అశోక్‌సేట్‌కు ఘన సన్మానం..

దైవ కార్యాలకు విరాళాలను అందజేస్తున్న అశోక్ సేటును ఆలయ కమిటీ ఘనంగా సన్మానించారు. సర్పంచ్ బైండ్ల రాజు, వీరన్న గుట్ట తండా సర్పంచ్ యాదవ్ గణేష్ నాయక్, ఎంపీటీసీ భర్త భూమేష్ ఆయనకు శాలువాకప్పి పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు శంకర్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ సిరివేని శంకర్, మధుకర్, జి.గంగాధర్, సందీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్: అయోధ్య రామాలయంలో రాముడి విగ్రహం ప్రధాని చేతుల మీదుగా ప్రాణ ప్రతిష్ట చేయడంతో ఆ మహాకార్యాన్ని పురస్కరించుకొని దేశమంతా ఆలయాల్లో రామస్మరణను జపం నిర్వహించారు. అందులో భాగంగా బోధన్ ఉమ్మడి మండలంలోని హనుమాన్ ఆలయం, రామ మందిరాలలో భక్తులు ప్రత్యేక పూజలు, హెూమాలు నిర్వహించారు. సాలూర మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో వేకువ జామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజ్ఞశ్రీ హైస్కూల్ అధినేత రాజు భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అయోధ్యలో రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంతో అంతట ఆలయాలు రామస్మరణ జపంతో మారుమోగాయి.

గాంధారి: మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. స్క్రీన్ ద్వారా అయోధ్యలో జరిగే విగ్రహ ప్రాణ ప్రతిష్ట లైవ్ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించారు. అలాగే మహా అన్నదానం, భజన పల్లకి సేవలు, శోభయాత్రలు వివిధ కార్యక్రమాలు చేపట్టారు.

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు..

నాగిరెడ్డిపేట్: మండల కేంద్రంలో గల కోదండ రామాలయంలో జెడ్పిటిసి ఉమ్మన్నగారి మనోహర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో ప్రాణప్రతిష్ట సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట సొసైటీ డైరెక్టర్ వంశీగౌడ్, వార్డు సభ్యులు మంత్రి ఆంజనేయులు, ఆలయ ధర్మకర్త అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామ గ్రామాన పల్లకి సేవ నిర్వహించి రామ జపం చేపట్టారు. అనంతరం ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆత్మకూర్, తాండూర్, బెజుగాం, చెరువు తండాలో నిర్వహించిన ర్యాలీలలో జెడ్పిటిసి మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో నిర్వహించిన పల్లకి సేవలో మహిళలు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

బిచ్కుంద: శ్రీ రాముని విగ్రహ ప్రాణప్రతిష్ట సందర్భంగా మండల కేంద్రంలోని మింజర్ హనుమాన్ మందిరంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ బీ.బీ.పాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, మాజీ శాసనసభ్యులు హనుమంత్ షిండే, అరుణతార పాల్గొన్నారు. ముందుగా మందిరంలో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం మహిళలు, ప్రజలు హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. మందిరం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీలో అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, నాయకులు, ప్రజలతో కలిసి వీక్షించారు. అనంతరం అప్పట్లో కర సేవలో పాల్గొన్న 21 మంది కర సేవకులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, జెడ్పిటిసి భారతి రాజు, సర్పంచ్ శ్రీరేఖ రాజు, కమల్ కిషోర్, వెంకట్‌రెడ్డి, విట్టల్‌రెడ్డి, సర్పంచ్ అస్పత్ వార్ వినోద్, శివకాంత్, శెట్టిపల్లి విష్ణు, పుల్లెన్ విట్టల్, షెట్కార్ రాజు, డాక్టర్ నరసింహులు, ఆయా గ్రామాల ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

ఎడపల్లి: బాల రాముని విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా మండలంలోని పలు గ్రామాలలో గ్రామ అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం ఆలయాల కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, జైతాపూర్ సహకార సంఘం అధ్యక్షులు కంటి సత్యనారాయణ, గ్రామపెద్దలు కరటూరి సూర్యనారాయణ, మదన్ మోహన్‌రెడ్డి, కష్టారెడ్డి, గ్రామపెద్దలు యువకులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే..

పిట్లం: మండల కేంద్రంలోని రామ మందిరంలో స్థానిక ఎమ్మెల్యే తోట లక్ష్మీకాతారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని పురస్కరించుకుని బజరంగ్ దళ్, హిందూ వాహిని, ఆలయ కమిటీలు పలు ఆలయాలను అంగరంగ వైభవంగా ముస్తాబ్ చేశాయి. కాగా మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా రాముల వారి ఊరేగింపు, సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రామాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆయనను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



పిట్లంలో...

సదాశివనగర్: మండలంలోని ప్రతి గ్రామంలో శ్రీ రామనామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. రాముని విగ్రహాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డిజె పాటలతో ఊరేగింపు నిర్వహించారు. సదాశివనగర్ మండల కేంద్రంలో కాశీ విశ్వేశ్వర ఆలయం వద్ద ఎల్ఈడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇండ్ల ముందర రంగురంగుల ముగ్గులు..

మద్నూర్: శ్రీ బాల రాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలోని ఇండ్ల ముందర మహిళలు రంగురంగుల ముగ్గులు వేసి వాకిళ్లను అలంకరించారు. అనంతరం ఉత్సవాల్లో పాల్గొన్నారు.

పోతంగల్: మండల కేంద్రంలోని రామమందిరంలో కాకడాహారతులతో వేడుకలు ప్రారంభించారు. అనంతరం ఊరేగింపు చేపట్టారు. పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-బోధన్

సాలూర మండలం సమీపంలో గల మంజీర నదిలో నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం పెంటాఖుర్దు గ్రామం వద్ద బోధన్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్‌ను అదుపులో తీసుకుని భూగర్భగనుల శాఖ అధికారులకు అప్పగిస్తామని బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధి ఇసుక ట్రాక్టర్ అని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఇసుక అక్రమ రవాణా జరగకుండా కఠినంగా వ్యవహరించాలని హెచ్చరించినా.. అక్రమార్కుల్లో మార్పు రావడం లేదు. అధికారుల కన్నుగప్పి రాత్రి, పగలు దొడ్డి దారిన ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు. మార్కెట్లో ఒక్కో ఇసుక ట్రాక్టర్ 6000 రూపాయలకు విక్రయిస్తున్నట్లు సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సైతం అక్రమ ఇసుకను విచ్చలవిడిగా దందా చేసిన వారు అదే అలవాటును ఇప్పటికి కొనసాగిస్తున్నట్లు జనం ఆరోపిస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఇసుక అక్రమ రవాణా దారులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మదన్ మోహన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత అంబులెన్స్ సర్వీస్

నవతెలంగాణ-లింగంపేట్(ఎల్లారెడ్డి)

మదన్‌మోహన్‌రావు ట్రస్ట్ ద్వారా సోమవారం ఉచిత అంబులెన్స్ సేవలు ప్రారంభించినట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన ప్రమీల గర్భిణి కావడంతో మదన్ మోహన్ ట్రస్ట్ అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రమేష్ అనారోగ్యానికి గురికావడంతో మదన్ మోహన్ ట్రస్ట్ అంబులెన్స్‌లో కామారెడ్డి జీవదన్ హాస్పిటల్‌కు తరలించారు.

గురుకులాల ప్రవేశానికి దరఖాస్తులు నేడు చివరి తేదీ

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ గురుకులాల ప్రవేశానికి ఆన్లైన్లో దరఖాస్తులకు నేడు చివరి తేదీ అని ఉప్పల్‌వాయి సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు, గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, ఫిబ్రవరి 11న జరిగే అర్హత పరీక్షల్లో పాల్గొనాలని సూచించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు

నవతెలంగాణ-పిట్లం



మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎరుకల బాలయ్య, పిట్లం మాజీ సర్పంచ్ హనుమ గంగారాం ప్రోద్బలంతో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సమక్షంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ అని కొనియాడారు. సామాన్య పేద ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే మనుగడ సాధ్యమని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి దొర, కుమ్మరి చిన్న రాములు, చిప్ప శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ప్రిన్సిపాల్



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ భానుమతి

నవతెలంగాణ-సదాశివనగర్

గణిత టాలెంట్ టెస్ట్‌లో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించిన మోడల్ స్కూల్ విద్యార్థి కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌లో సదాశివనగర్ ఆదర్శ పాఠశాలకు చెందిన ఏ భవిత్‌కుమార్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలోనే మొదటి ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ భానుమతి తెలిపారు. సోమవారం పాఠశాలలో గైడ్ టీచర్ బి.దశరథ విద్యార్థి భవిత్ కుమార్‌ను అభినందించారు. అదేవిధంగా మండల కేంద్రంలో నిర్వహించిన గణిత టాలెంట్ టెస్ట్‌లో సైతం మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ ఎ.భవిత్ కుమార్, ద్వితీయ సిహెచ్ వర్షిణీ, కె.కీర్తి తృతీయ స్థానాలను సాధించారని తెలిపారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు అనిత శర్మ విద్యారమణ, ఉపాధ్యాయులు రాజశేఖర్, రాజేందర్ పాల్గొన్నారు.

లారెక్కిన రైలింజన్

● **ఆసక్తిగా చూసిన ప్రజలు**



లారిలో తీసుకెళ్తున్న రైల్ ఇంజన్

నవతెలంగాణ-సదాశివనగర్

ఓ రైలు ఇంజన్‌ను లారీలో తరలిస్తుండగా.. ప్రజలు ఆసక్తిగా చూశారు. సోమవారం కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం పద్మాజివాడి చౌరస్తాలో జాతీయ రహదారిపై లారీలో రైలు ఇంజన్‌ను తరలించారు. కాగా.. అదే రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

గోదాములలో స్థలం కేటాయించాలి

● **ఎఫ్‌సిఐ. జనరల్ మేనేజర్ రాజును కోరిన కలెక్టర్ జితేష్ వి.పాటిల్**

నవతెలంగాణ-కామారెడ్డి

గత ఖరీఫ్‌కు సంబంధించి పెండింగ్ ఉన్న ధాన్యాన్ని భారత ఆహార సంస్థకు అప్పగించేందుకు గోదాములలో స్థలం కేటాయించవలసినదిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఎఫ్.సి.ఐ. జనరల్ మేనేజర్ రాజును కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఎఫ్.సి.ఐ. జనరల్ మేనేజర్ రాజుకు జిల్లా కలెక్టర్ పూల మొక్కను అందించి ఆహ్వానించారు. సోమవారం కలెక్టరేట్ క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో భారత ఆహార సంస్థ జనరల్ మేనేజర్ రాజు మాట్లాడుతూ సి.ఎం.ఆర్. జాప్యంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున జిల్లాలో ధాన్యం పెండింగ్ ఉన్న రైస్ మిల్లులు ఈ నెలాఖరులోగా తమకు కేటాయించిన లక్ష్యం మేరకు అందించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. 24 గంటలు మిల్లులను నడపాలని, లక్ష్యాలను సాధించిన మిల్లర్లను సమన్వయం చేసుకుంటూ వారి సహకారంతో టార్గెట్ పూర్తి చేయాలని ఆదేశించామని, రోజు పలు రైస్ మిల్లలను ఆకస్మిక తనిఖీ చేస్తూ వేగవంతం చేస్తున్నామన్నారు. కాగా ఎఫ్.సి.ఐ.లో ధాన్యం నిల్వకు స్థలం కేటాయించాలని, అదేవిధంగా రవాణాకు అధికంగా వ్యాగన్‌లను కేటాయించాలని కోరగా రాజు సానుకూలంగా స్పందించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్ర మోహన్, ఎఫ్.సి.ఐ. డివిజనల్ మేనేజర్ ప్రకాష్ వర్మ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మేనేజర్ శేఖర్, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్ బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎఫ్.సి.ఐ జనరల్ మేనేజర్ రాఘు

గోమాత షెడ్డు నిర్మాణానికి సహకరించిన వారికి సన్మానం



సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద గోమాతల షెడ్డు నిర్మాణానికి సహకరించిన పరమకష్ణ సిద్దిపేట జనార్దన్‌రెడ్డికి ఆలయ కమిటీ అధ్యక్షులు సిరివేని శంకర్, సర్పంచ్ బైండ్ల రాజు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. బలరాముడి ప్రాణ ప్రతిష్టాపనలో భాగంగా వారిని గ్రామపెద్దలు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం అందిస్తా

● **ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి**

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని నూతనంగా నిర్మాణం చేపడుతున్న అయ్యప్ప ఆలయ నిర్మాణం కొరకు తన వంతు ఆర్థిక సాయం అందిస్తానని జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రముఖ శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. సోమవారం మండల సమీపంలోని నూతనంగా నిర్మాణం చేపడుతున్న అయ్యప్ప ఆలయాన్ని సందర్శించారు. ఏకశిల విగ్రహంపై 18 మెట్లు ఏర్పాటు చేయడం అయ్యప్ప ఆలయానికి జిల్లాలో ప్రత్యేక ప్రాముఖ్యత ఉంటుందని ఆయన అన్నారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు అయ్యప్ప ఆలయం నిర్మాణం చేపట్టడం అందరూ భాగస్వాములు కావాలన్నారు. అయ్యప్ప ఆలయ నిర్మాణానికి 1000 సిమెంట్ బస్తాలు అందజేస్తానని ఆయన హామీనిచ్చారు. యావత్ భారతావని ఎదురు చూస్తున్న భవ్య క్షేత్రం అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ట మహెూత్సవం వైపు ఆసక్తితో దేశ ప్రజలు చూస్తున్నారని సందర్భంగా పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఇందులో బాగానే ముస్తాపూర్ ఎల్లారెడ్డి ఆలయంలోని గ్రామంలోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుట్టపై అయ్యప్ప ఆలయం నిర్మాణం చేపట్టడం అయ్యప్ప సేవా సమితి కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. అనంతరం పైడి ఎల్లారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి నిర్వాహకులు రవిగౌడ్, శంకర్ పంతులు, చంద్రమౌలి, రాజిరెడ్డి, బాలకిషన్, సత్యనారాయణరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, అంజయ్య, ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖ శాస్త్రవేత్త పైడి రాకేష్

లక్ష్మపూర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

నవతెలంగాణ-వర్ని(చందూర్)

చందూర్ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ వర్ని ఆధ్వర్యంలో ఉచిత కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో 65 మందికి కంటి పరీక్షలు, 77 మందికి దంత పరీక్షలు చేశారు. 8మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్స కోసం లయన్స్ కంటి ఆసుపత్రి బోధన్‌కు వెళ్ళవచ్చని సూచించారు. కొందరికి ఐ డ్రాప్స్, దంతాలకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ, డెంటల్ డాక్టర్ రాజశేఖర్, లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సతీష్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు దొరబాబు, కార్యదర్శి అతిమల నాగేష్, రిజినల్ చైర్మన్ శివనాగేశ్వరరావు, రిజినల్ సెక్రటరీ నర్సయ్య, సాంబశివరావు, విఠల్ పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నవతెలంగాణ
నిజామాబాద్
మంగళవారం | జనవరి 23, 2024 | www.navatelangana.com

ప్రైవేటు రంగంలో ఉద్యోగ మేళా

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కోసం ఈ నెల 24న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల్ల శ్రీనివాస్ తెలిపారు. ఉద్యోగమేళాకు 18 సం'ల నుండి 30 సం'ల వరకు ఉండాలని, అసక్తి గల నిరుద్యోగులు జిల్లా ఉపాధి కార్యాలయం నిజామాబాద్ జిల్లా ఉద్యోగమేళా పాల్గొనాలని పేర్కొన్నారు. వివరాలకు 9581768413, 99487 48428, 9959456793 ఫోన్ ద్వారా సంప్రదించాలని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఉదయం10-00 నుండి మధ్యాహ్నం 2-00 గం''ల లోపల ఈనెల 24న జిల్లాఉపాధి కార్యాలయం శివాజీ నగర్ నిజామాబాద్ పాల్గొనాలని పేర్కొన్నారు. బయో డేటా, రెజ్యూమ్, ఆధార్ కార్డు, పాసుపోర్టు సైజు ఫోటో, స్టడీ సర్టిఫికెట్స్‌తో రావాలని తెలిపారు.

యంచ గోదావరిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ- నవీపేట్

మండలంలోని యంచ గ్రామ పరిధిలోని గోదావరి నదిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై యాదగిరి గౌడ్ సోమవారం తెలిపారు. యంచ గ్రామ కార్యదర్శి సుధారాణి సమాచారంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చారు. మృతుడి వయసు సుమారు 30 నుంచి 35 సంవత్సరాల ఉంటుందని కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని. ఎవరికైనా మృతుని వివరాలు తెలిస్తే ఈ క్రింది నెంబర్లకు సంప్రదించాలని 8712659845,8712659843 ఎస్ఐ యాదగిరి గౌడ్ కోరారు.

బీఆర్ఎస్‌కు ఎస్‌సి సెల్ కార్యదర్శి రాజీనామా

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ ఎస్‌సి సెల్ కార్యదర్శి మదారి నరేష్ బి ఆర్ ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఏకపక్ష నిర్ణయాల వల్ల , నియోజక వర్గం లో ఓటమి పాలయ్యడని, పార్టీలో కొందరు స్వార్థపరులు కావాలనే జీవన్ రెడ్డి నీ ఓడించారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి ప్రజల పట్ల అహంభావం ప్రదర్శించడం వల్ల ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పారని తెలిపారు. భవిషత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానని పేర్కొన్నారు.

విద్యార్థికి ఇంటింటా ఇన్నోవేషన్ అవార్డు



అవార్డు అందుకున్న విద్యార్థిని సాయి చరణ

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని సుర్బియాల్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న సాయి చరణ అనే విద్యార్థిని ఇంటింటా ఇన్నోవేషన్ 20 24 సంవత్సరానికి గ్రామస్థాయి అవార్డు వచ్చినట్లు గైడు టీచర్ పసుపుల రఘునాథ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంట్రా ఫార్మ్ నందు 22 ప్రాజెక్టు తయారు చేయగా బ్రింగ్స్ లైఫ్ ఆప్స్ వితౌట్ కరెంటు అని మోడల్‌కు జిల్లాలో గత 15 ఆగస్టు రోజున అప్పటి మంత్రి ప్రశాంత్ రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్ పొందారని చెప్పారు. ఈ సంవత్సరం గ్రామస్థాయి ఇంటింటా ఇన్నోవేషన్ అవార్డు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. వచ్చే జనవరి 26న పాఠశాలలో జరిగే గణతంత్ర వేడుకల్లో సర్పంచ్ సట్లపల్లి సవిత గణేష్, హెడ్మాస్టర్ నారాయణ సమక్షంలో అవార్డు అందజేయడం జరుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు.

బోధన్‌లో న్యాయవాదుల క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ జిల్లా న్యాయవాదుల సహకార సంఘం వారి టేబుల్ క్యాలెండర్‌ను బోధన్ కోర్టు ఆవరణలో న్యాయవాదులు సోమవారం ఆవిష్కరించారు. సంఘం ఉపాధ్యక్షులు టి.శంకర్ బోధన్ బార్ అసోసియేషన్‌లో 2024-2025వ సంవత్సరానికి సంబంధించిన టేబుల్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. కోర్టు పనిదినాలు, సెలవులు, వెకేషన్స్ వివరాలు కూడి ఉండటంతో న్యాయవాదులకు ఉపయోగకరంగా ఉంటుందని న్యాయవాదులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు సిహెచ్‌వి హనుమంతరావు, డాక్టర్ సమ్మయ్య, మాధవీలత, గోపి, రవీందర్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.


షబ్బీర్‌అలీకి శుభాకాంక్షలు తెలిపిన పలువురు


షబ్బీర్ అలీని సన్మానిస్తున్న పార్టీ నాయకులు

నవతెలంగాణ-దోమకొండ

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల ప్రభుత్వ సలహాదారుడుగా మాజీ మంత్రి మహమ్మద్ షబ్బీర్ అలీని నియమించినందుకు గానూ దోమకొండ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు చంద్రయ్య గారి అనంతరెడ్డి, జడ్పీటీసీ తీర్మల్‌గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం, తనపై నమ్మకంతో నియమించినందుకు రాష్ట్రంలోని ప్రజల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఫిరంగి రాజేశ్వర్, నిమ్మ శంకర్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శులు అబ్రబోయిన స్వామి, శ్రీకాంత్, నాయకులు రామస్వామిగౌడ్, సంతోష్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీతారాం, మధు, రాములు, గోపాల్‌రెడ్డి, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి


విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

తెలంగాణ-రాజంపేట్

విద్యార్థులు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని ఆర్‌బిఎస్‌కే వైద్యులు హరీష్‌గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని ఆరేపల్లి తాండ గ్రామంలోని అంగన్వాడి ఈ కేంద్రంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు హెల్త్ న్యూట్రిషన్ ఫుడ్ తీసుకోవాలని, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు దివ్యభారతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను రక్షిద్దాం.. చదివిద్దాం

- భేటీ బచావో.. బేటీ పడావో అంటూ ప్రతిజ్ఞ
- జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో పలు పోటీలు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జాతీయ బాలికల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమంపై జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆడపిల్లలను రక్షిద్దాం - వారిని చదివిద్దాం అని పిలుపునిచ్చారు. అంకితభావంతో కృషి చేస్తామని జిల్లా అధికారులు ప్రతిజ్ఞ చేస్తూ సంతకాలు చేశారు. అనంతరం జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమం ఏర్పాట్లపై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమాలను విస్తృత స్థాయిలో నిర్వహించాలని అన్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులతో పాటు ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాస రచన, ఉపన్యాస, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయాలని సూచించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ రసూల్ బీడీఈఓ దుర్గాప్రసాద్, డీఐఈఓ రఘురాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, మండలంలోని సుర్బిర్యాల్ గ్రామంలో భేటీ బచావో- భేటీ పడావో అంశం పైన బాలికలకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి, గెలుపొందినవారికి బహుమతులు అందజేశారు. విద్యర్థినులందరికీ కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. బాలురతో సమానంగా బాలికలను పెంచాలని, వివక్షతో చూడరాదని, బాల్యవివాహాలు చేయరాదని, సమాచారం తెలిస్తే హెల్ప్‌లైన్ 1098కి తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి పేరు గోప్యంగా ఉంచుతామని చెప్పారు. బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ జ్యోతి, సూపర్వైజర్లు శ్రీదేవి,, వెంకట రమణమ్మ, హెడ్మాస్టర్ రవీందర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో...


నిజామాబాద్‌సిటీ:ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

కమ్మర్‌పల్లి: జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జనవరి 19 నుండి 24 వరకు మండలంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ భీంగల్ ప్రాజెక్టు మండల పర్యవేక్షకురాలు సరస్వతి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 8, 9, 10వ తరగతి విద్యార్థినిలతో బేటి పడావో.. బేటి బచావో కార్యక్రమంపై అవగాహన కల్పించి మాట్లాడారు. విద్యార్థినులు ఉన్నత చదువులు చదువుకోవడం ద్వారా తమ కాళ్లపై తాము సగర్వంగా నిలబడవచ్చు అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. విద్యార్థినిలు శుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థినిలతో బేటీ పడావో..బేటీ బచావోపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారిని గంగామణి కిశోర బాలికలతో సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు యమున, బాలమణి, గంగా జమున, దివ్య, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లి : అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్

హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలో కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా డాక్టర్ హరికృష్ణ, కార్యదర్శిగా మహమ్మద్ యాసిన్ ఎన్నికైయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ అబ్జర్వర్ గా, శ్రీనివాస్, విష్ణువర్ధన్, ఒలంపిక్ అసోసియేషన్ తరుపున బొబ్బిలి నర్సయ్య ప్రశాంత్, హ్యాండ్ బాల్ సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ.. నిజామాబాద్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యవర్గానికి తనపై నమ్మకంతో ఎన్నుకున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. హ్యాండ్ బాల్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ గ్రామీణ స్థాయి నుండి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులను ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఇందుకు అసోసియేషన్ తోపాటు మిగతా క్రీడాకారుల అసోసియేషన్లు ప్రతి ఒక్కరి సహాయ సహకారాలతో ముందుకు వెళ్తానని హామీ ఇచ్చారు.


ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

గురుకులాల్లో దరఖాస్తులకు నేడు ఆఖరు

నవతెలంగాణ-బోధన్

గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశాల కొరకు జనవరి 23వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవడానికి ప్రభుత్వం గడువు పొడిగించిందని బోధన్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు 5వ తరగతిలో ప్రవేశం కొరకు మీ సేవలో, ఆన్లైన్ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు చేసుకున్న వారికి ఫిబ్రవరి 11వ తేదీన ప్రవేశ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

రైలు నుంచి జారిపడిన వ్యక్తి తలకు గాయాలు

- ప్రభుత్వాస్పత్రికి తరలించిన కామారెడ్డి రైల్వే పోలీసులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లాలోని అడ్లూరు గ్రామ శివారులో గుర్తుతెలియని రైలు నుంచి సోమవారం ఓ వ్యక్తి జారిపడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని వెంటనే కామారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఆ వ్యక్తి ప్రస్తుతం కామారెడ్డి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ఎవరైనా గుర్తుపడితే ఫోన్ నెంబర్లు, 97032 17723, 87126 58614 సంప్రదించాలని సూచించారు.


గాయపడ్డ వ్యక్తి

అవినీతి బయటపడుతుందనే పిచ్చికూతలు

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

కేటీఆర్ హరీష్ రావు అవినీతి బయటపడుతుందని భయంతోనే పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అంతిరెడ్డి రాజారెడ్డితో కలిసి పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మానాల మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని గత ప్రభుత్వ బి ఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 50 రోజులుగా గత ప్రభుత్వం చేసిన అవకతవకలను, పాపాలను నిర్వీర్యం చేసిన వ్యవస్థలు అన్నింటిని ఒక దారిలో పెడుతుందని, కానీ కేటీఆర్ హరీష్ రావు ఎక్కడ వాళ్ళ డొల్లతనం అవినీతి బయటపడుతుందో అని భయపడి ఒకరు కరెంటు బిల్లు సోనియాగాంధీకి పంపుతామని, ఒకరు 4000 పెన్షన్ ఏమైందని పిచ్చికూతలు కూస్తున్నారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఐదు సంవత్సరాలుగా నిరుద్యోగ భృతి పేరుతో, పేపర్ లీకేజీలతో ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను నిర్లక్ష్యం చేసిందని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కార్పోరేషన్లలో తీసుకున్న అప్లికేషన్లను పరిశీలించకుండా ప్రజలను మోసం చేసిన చరిత్ర బిఆర్ఎస్ పార్టీదని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీలను తప్పకుండా వందరోజుల్లో పూర్తి చేస్తుందని తెలిపారు. అందులో ఇప్పటికే రెండుహామీలను ప్రభుత్వం ఏర్పడిన మూడు రోజుల్లోనే అమలు చేసిందని అన్నారు. రైతుబంధు కూడా దాదాపు 50 శాతం వరకు పూర్తి కావడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇవేవీ ఆలోచించని కేటీఆర్ హరీష్ రావు కేవలం కాలం గడపాలని కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు మాటలు మాట్లాడుతున్నారని, ఇది వారికి సరైన పద్ధతి కాదని మానాల మోహన్ రెడ్డి హితవు పలికారు. ఇలాగే చేయాలని చూస్తే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు రోడ్లపై తరిమి కొడతారని తెలిపారు. సమావేశంలో కైసర్, సర్దార్, నరేంద్ర సింగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

ఆలయాలను సందర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ మద్నూర్

అయోధ్యలో సోమవారం శ్రీ బలరాముడి ప్రాణ ప్రతిష్ట సందర్భంగా గ్రామాన ఉత్సవాలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలను జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీకాంతరావు సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామాల్లో ఎమ్మెల్యేకు ఘన సన్మానాలు చేశారు.

బీఎస్పీ పాల్వంచ మండల కమిటీ ఎన్నిక


ఎన్నికైన మండల కమిటీ సభ్యులు

నవతెలంగాణ-మాచారెడ్డి

బహుజన సమాజ్ పార్టీ పాల్వంచ మండల కమిటీ ఎన్నుకున్నారు. సోమవారం పాల్వంచ మండల కేంద్రంలో మండల సమావేశం నిర్వహించి బహుజన సమాజ్ పార్టీ మండల కమిటీని ఎన్నుకున్నారు. కామారెడ్డి అసెంబ్లీ ఇన్చార్జి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కమిటీ ఎన్నికకు ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు బట్టంకి బాలరాజు, జిల్లా కోశాధికారి హరిలాల్ నాయక్, దోమకొండ మండల అధ్యక్షులు నత్తి జీవన్ హాజరయ్యారు. మండలాధ్యక్షునిగా ఈసాయిపేట శంకర్‌బాబు, మండల ఉపాధ్యక్షులుగా దేవుళ్ళ శ్రీకాంత్, మండల ప్రధాన కార్యదర్శిగా పోతుల లక్ష్మణ్, కార్యదర్శులుగా నిమ్మరాజు, నంద్యాల రమేష్, కోశాధికారిగా సిహెచ్ దేవేందర్, అడ్వైజర్‌గా రాజు, కొంగుల భూమేష్, రవీందర్, సిహెచ్ మైసయ్య, జి.నరేష్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణానికి చెందిన ఇద్దరికి డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌ఓ చంద్ర శేఖర్‌రెడ్డి తెలిపారు. సెకండ్ క్లాస్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కామారెడ్డి ప్రతాప్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో కామారెడ్డి పట్టణానికి చెందిన రామచంద్రం, యాదగిరి రాజుకు రెండు రోజుల జైలు శిక్ష, 200 రూపాయల అపరాధ రుసుము విధించినట్లు ఆయన తెలిపారు

పంట వివరాలు నమోదు


పంట నమోదు చేస్తున్న అధికారి

నవతెలంగాణ-రెంజల్

మండలంలో యాసంగి సీజన్లో రైతులు పండించిన పంటల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ వివరాలను నమోదు చేస్తున్నట్టు మండల వ్యవసాయ విస్తీర్ణాధికారి ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం మండల శివారులోని పంట పొలాలలోకి క్షేత్రస్థాయికి వెళ్లి పంట పొలాల వివరాలను సేకరించారు. అయితే సాగు చేస్తున్న వాటి వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

రామాలయంలో అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలో సోమవారం శ్రీరామాలయాలలో ఘనంగా అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు. మండలంలోని వీరన్నగుట్ట, కూనేపల్లి, రెంజల్, కందకుర్తి, సాటాపూర్, నీలా, తాడ్‌బిలోలి, తదితర గ్రామాలలో బాల రాముడి ప్రాణ ప్రతిష్టాపనలో భాగంగా ఆలయాలలో రామస్మరణంతో మారుమోగాయి. అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్టాపనలో భాగంగా జరిగిన కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. అనంతరం గ్రామస్తులందరికీ అన్నదాత కార్యక్రమాలను చేపట్టారు. కొన్ని గ్రామాలలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

సులబ్ కాంప్లెక్స్ నిర్మాణానికి స్థలం గుర్తించండి

- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



నవతెలంగాణ-జైపూర్

భీమారం మండల కేంద్రంలో సులబ్ కాంప్లెక్స్ నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని గుర్తించాలని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశించారు. భీమారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎమ్మార్సీ భవనాన్ని సోమవారం స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. దీనికి ముందు మండలానికి వచ్చిన ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి జడ్పీటీసీ భుక్య తిరుమల లక్ష్మన్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సంధర్భంగా మండల పరిధిలో వసతుల కల్పన అభివృద్ధి పనుల విషయమై స్థానిక జడ్పీటీసీ భుక్య తిరుమల లక్ష్మన్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోగా ఆయన సానుకూలంగా స్పందించారు. గత ప్రభుత్వ ఖజానా ఖాలీ చేసిందని, కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. అదే విధంగా గ్రామ పంచాయతీలలో అంచెలంచలుగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. మండల ప్రజల అవసరాల మేరకు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో 108 అంబులెన్స్ అవసరాన్ని జడ్పీటీసీ గుర్తు చేశారు. భూర్గుపల్లి గ్రామ పంచాయతి పరిధిలో విద్యుత్ సబ్ స్టేషన్ విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. యువకుల సౌకర్యార్థం మండల కేంద్రంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విశ్వంబర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, స్థానిక సర్పంచ్ గద్దె రాంరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్, నాయకులు చేకుర్తి సత్యనారాయణరెడ్డి, పొడేటి రవి పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ



నవతెలంగాణ-జన్నారం

అయోధ్యలో బాల రాముని ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని, మండలంలోని అన్ని గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గ్రామాల్లో ఉదయం నుంచే ఇంటిపై శ్రీరాములు జెండాలు కడుతూ కాషాయ తోరణాలతో గ్రామాలు కాశాయమయం అయ్యాయి. పట్టణంలోని శ్రీరాముని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామ గోదావరి నది ఒడ్డున వెలసిన శ్రీ చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం చేశారు. మండల కేంద్రంలోని మేదరి వాడలో హనుమాన్ ఆలయంలో శ్రీరాముని చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. కిష్టాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు హనుమాన్ భక్తులు గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. తిమ్మాపూర్ గ్రామంలోని రామాలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమం గ్రామ సర్పంచ్ జాడి గంగాధర్ సహకరించినట్లు కమిటీ నిర్వాహకులు యుగంధర్ రవి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో, ఎంపీటీసీ వెంకటస్వామి, కిష్టాపూర్ గ్రామస్తులు వాసాల నరేష్, గట్టు మహేష్, బండారి స్వామి పాల్గొన్నారు.

దండేపల్లి : అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అన్ని గ్రామాల్లో రామాలయాల వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం వేళలో ఉత్సవ విగ్రహాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలు, నృత్యాలతో మంగళహారతితో ఘనంగా స్వాగతం పలికారు.

వెల్లివిరిసిన మతసామరస్యం

మామిడిపల్లి గ్రామానికి చెందిన సలీం అనే ముస్లిం వ్యక్తి అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవ సందర్భంగా నుదుట తిలకం దిద్దుకుని చేతిలో కాశయ్య జెండా పట్టుకుని గ్రామంలోని గడపగడపకు తిరుగుతూ హిందూ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను హిందువులంతా అభినందించారు.

రామకృష్ణాపూర్ : అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్టాపన సందర్భంగా పట్టణంలోని స్థానిక నాగార్జునకాలని యూత్ ఆధ్వర్యంలో భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు చిన్న పెద్ద తేడా లేకుండా పూజా కార్యక్రమంలో పాల్గొని జై శ్రీరామ్ జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

మహానీయుల స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

నవతెలంగాణ-జైపూర్

యువత మహానీయులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని జైపూర్ ఏసీపీ బాలుసాని మోహన్ సూచించారు. సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్ఎఫ్ నాయకులను ఉద్దేశించి మాట్లాడిన ఆయన మహానీయులు అడుగుజాడల్లో నడవడంతో పాటు వారి ఆశయ సాధన కోసం కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటాన్ని ఏసీపీ మోహన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రామగిరి రాము మాదిగ, ప్రధాన కార్యదర్శి నిట్టూరి ప్రశాంత్ మాదిగ, ప్రచార కార్యదర్శి రాకేష్ మాదిగ, తుంగపిండి లక్ష్మన్ మాదిగ, ఎమ్మెస్ఎఫ్ జిల్లా నాయకులు కలగూర సునీల్ మాదిగ, సంతోష్ మాదిగ పాల్గొన్నారు.



సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంచాలి


సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపుతో పాటు దేశ వ్యాప్తంగా అన్ని రకాలైన వ్యాధులకు అపరిమితమైన వైద్య సేవలు అందించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సంధర్భంగా సింగరేణి సీఎండీ బలరామ్ నాయక్‌ను కలిసిన అసోషియేషన్ నాయకులు రిటైర్డ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు పరిష్కారమార్గం చూపించాలని కోరారు. సింగరేణి ఆస్పత్రుల్లో సీపీఆర్ ఎంఎస్ మెడికల్ కార్డుల్లో కోత విధించరాదని కోరిన నాయకులు అధికారులకు, ఉద్యోగులకు ఒకే రకమైన మెడికల్ కార్డు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అభయహస్తం గ్యారంటీ స్కీంలు విశ్రాంత సింగరేణి ఉద్యోగులకు వర్తింపజేయాలని, తెల్లరేషన్ కార్డు, వృద్ధాప్య పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా రూ.20 లక్షల గ్రాట్యూటీ సీలింగ్ 2016 జూలై 1 నుంచి చెల్లించడంతో పాటు రిటైర్డ్ ఉద్యోగుల ఇతరత్ర డిమాండ్ల పట్ల యాజమాన్యం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని వినతీ పత్రంలో పేర్కొన్నారు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల డిమాండ్ల పట్ల సీఎండీ బలరామ్ నాయక్ సానుకూలంగా స్పంచడంతో పాటు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు అసోషియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆళవందార్ వేణుమాదవ్ తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బీరయ్య, సంయుక్త కార్యదర్శి నర్సింగ్‌రావు, కొత్తగూడెం ఏరియా రిటైర్డ్ కార్మిక సంఘం నాయకులు మాతంగి లింగయ్య, లక్ష్మినారాయణ, భూపాల్‌పల్లి ఏరియా నాయకులు రాజిరెడ్డి, సమ్మిరెడ్డి, రాజయ్య, ఖమ్మం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, మంచిర్యాల జిల్లా నాయకులు గజెల్లి వెంకటయ్య, ఏఐటీయూసీ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్, అడిషనల్ ప్రధాన కార్యదర్శి రంగయ్య, దమ్మలపాటి శేషయ్య, కేంద్ర కార్యదర్శి వెంకట్‌తో పాటు వివిధ ఏరియాలకు చెందిన 300 మంది సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పేదల ఇండ్లకు ఉచిత ఇసుక సరఫరా

- గతేడాది కంటే ట్రిప్పుకు రూ.50 తగ్గింపు
- వేంపల్లి ఇసుక రీచ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

నవతెలంగాణ-హాజీపూర్

ఇండ్లు నిర్మించుకునే పేదలకు ఉచిత ఇసుక రవాణా చేయనున్నట్లు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు తెలిపారు. మండలంలోని వేంపల్లి గ్రామ శివారు గోదావరిలో సోమవారం అదనపు కలెక్టర్ మోతీలాల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని అన్నారు. వేంపల్లి ఇసుక రీచ్ ద్వారా తక్కువ ధరలో నాణ్యమైన ఇసుక సరఫరా చేయనున్నట్లు తెలిపారు. గతేడాది కంటే ప్రస్తుతం ఒక్కో ట్రాక్టర్ ట్రిప్పుపై రూ.50 తగ్గిస్తున్నట్లు పేర్కొన్నారు. వేంపల్లి గ్రామస్థుల కు తక్కువ ధరకు ఇసుక సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇల్లు నిర్మించుకునే పేదలు ధవ పత్రాలతో ఆన్లైన్ లో ధరఖాస్తు చేసుకుంటే నేరుగా ఇంటికే ఉచితంగా ఇసుక వస్తుందన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన నెల రోజుల సమయం లోనే గూడెం లిఫ్ట్ ద్వారా లక్షెట్టిపేట్, దండేపల్లి, హాజీపూర్ మండలాల రైతులకు సాగు నీరు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాల, నస్పూర్ పట్టణాల ప్రజలకు తాగు నీటికి ఇబ్బందులు రాకుండా చుస్తున్నామన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం రాబోవు రోజుల్లో చేపట్టాల్సిన పనులపై సమీక్షిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనింగ్ ఏడీ బాలు, స్థానిక సర్పంచ్ వోలపు శారద, ఎంపీటీసీలు డేగ బాపు, ఒడ్డే బాలరాజు, డీటీ హరిత, ఆర్ఐ మంగ, కాంగ్రెస్ మండల అద్యక్షుడు తోట రవి పాల్గొన్నారు.

బదిలీలు, ఉద్యోగోన్నతులు పారదర్శకంగా చేపట్టాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్



నవతెలంగాణ-నస్పూర్

అంగన్‌వాడీ ఉద్యోగుల బదలీలు, ఉద్యోగోన్నతులు పారదర్శకంగా చేపట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగుల బదిలీల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో ఐసీడీఎస్ పరిధిలో అంగన్‌వాడీ ఉద్యోగుల బదిలీలు, ప్రమోషన్ల దరఖాస్తుల ప్రక్రియను జిల్లా అధికారులు గత సంవత్సరం జులై నెలలో ప్రారంభం చేయడం జరిగిందని, నేటికి నెలలు గడుస్తున్న అధికారులు మాత్రం బదిలీలా ప్రక్రియను ఇంకా పూర్తి చేయలేదన్నారు. అదే విదంగా కొంతమంది వ్యక్తులు బదిలీలా విషయంలో అధికారులను ప్రలోబాలకు గురిచేసి, వారికి అనుకూలమైనా వారికి సులభంగా బాధిలీలు చేసుకునే అవకాశలు ఉన్నాయని, అదే విదంగా ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారి పేర్లు, వారి అర్హతలను వారి కార్యాలయంలోని నోటిస్ బోర్డుపై పెట్టలేదన్నారు. కావున ఎలాంటి అవకతవకలు జరగకుండా అర్హులైన ఉద్యోగులకు న్యాయం చేసే విదంగా కలెక్టర్, డీడబ్ల్యూఓ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి

నవతెలంగాణ-నస్పూర్

నస్పూర్ కాలనీలోని ప్రాణహిత స్టేడియంను 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలకు సంబంధించిన ముందస్తు ఏర్పాట్ల పనులన్నీ వీలైనంత తొందరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జీఎం సంజీవరెడ్డి సూచించారు. సోమవారం ప్రాణహిత స్టేడియంను సందర్శించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేడియంలో మొట్టమొదటిసారిగా గణతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా వేడుకలలో పాల్గొనే వారందరికీ కావలసిన సదుపాయాలను కల్పించాలని అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో వివిధ గనులలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపిక చేయబడిన వారికి సన్మానం, మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వేడుకలలో ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, పుర ప్రజలు అందరూ పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం కె రఘు కుమార్, డీజీఎం పర్సనల్ పి.అరవిందరావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీమోహన్, సీనియర్ పీఓఓ కాంతారావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సివిల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆలయాల్లో అన్నదానాలు

- ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండల కేంద్రంలో శ్రీ బాలరాముడి ప్రాణప్రతిష్ట ఉత్సవాలను గ్రామ ప్రజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని రథం గల్లీలో గల శ్రీ లక్ష్మీ నారాయణ రామ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అన్నదానం చేపట్టారు.

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి రథయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారి రథయాత్ర కార్యక్రమాన్ని కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సోమవారం జండా ఊపి ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు పశ్చిమ హౌసింగ్ బోర్డు కాలనీలో గల శ్రీ సంకష్టహర మహా గణపతి క్షేత్రంలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి రథయాత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, వార్డు కౌన్సిలర్ కృష్ణమోహన్ హాజరై పూజలు నిర్వహించి, అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ మంచి రవి ఇంట్లో గల సీతారామచంద్రస్వామి ఆంజనేయ స్వామి విగ్రహాలకు పూజలు నిర్వహించారు. సంకష్టహర మహా క్షేత్రం నుంచి నిజాంసాగర్ చౌరస్తా వరకు ర్యాలీగా డప్పు వాయిద్యాలు ఆటలతో పాటలతో టపాకాయలు కాల్చి శ్రీసంకష్టహర మహా గణపతి క్షేత్రానికి వచ్చి ఆలయంలో ప్రతిష్టించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచి రవి, కార్యదర్శి రవీందర్‌గౌడ్, కోశాధికారి సుతారి అంజయ్య, ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి, సభ్యులు విశ్వనాథం, లింగం భక్తులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అక్షింతలు పంపిణీ


సదాశివనగర్ : ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

నవతెలంగాణ-సదాశివనగర్/మద్నూర్

మండలంలోని వజ్జేపల్లి తండాల్లో అయోధ్య అక్షింతల ఊరేగింపును సోమవారం శోభాయమానంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాండలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి భాజాభజంత్రీలు, భజనలు, భక్తి సంకీర్థనలు ఆలపిస్తూ మంగళ హారతులతో తండాల్లో అక్షింతలను ఊరేగించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి అక్షింతలు, కరపత్రం, జెండాను అందజేశారు. రామమందిర ప్రాణప్రతిష్ట సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్ కుమార్, ఉప సర్పంచ్ స్రవంతి, నాయకులు మంగ్యానాయక్, సర్దార్ నాయక్, లచ్చిరామ్ నాయక్, శంకర్ నాయక్, సరిచంద్, బలిరామ్ నాయక్, చంద్రునాయక్, ధూమా, మోతీరాం, వెంకట్‌రామ్, గంగారాం, మోహన్, హరీ, సంతోష్, లక్ష్మణ్, రవి తండా ప్రజలు పాల్గొన్నారు.

మాచారెడ్డి : మండలంలోని లక్ష్మి రావులపల్లి గ్రామంలో సోమవారం అయోధ్యలో శ్రీరామ మందిర ప్రాణ ప్రతిష్ట సందర్భంగా గ్రామంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం సన్నిధిలో పాలాభిషేకం, పంచామృతాభిషేకం స్వామివారికి చందన పూజ జరిపి అనంతరం శ్రీరాముల విగ్రహాలను రామాంజనేయ యువజన సభ్యులు గ్రామంలో వీధివీధినా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రామాంజనేయ యువజన సభ్యులు, గ్రామ పాలకవర్గం, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు కేంద్ర పథకాలు అందాలి

- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కామారెడ్డి

నిరుపేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాలనేదే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ లక్ష్యమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. కామారెడ్డి పట్టణంలోని నిజాంసాగర్ చౌరస్తాలో సోమవారం వికసిత భారత్ ఎల్ఈడి స్క్రీన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందజేస్తూ పేద ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేస్తుందని తెలిపారు. రుణాలు సక్రమంగా చెల్లించిన వీధి వ్యాపారులకు బ్యాంకుల ద్వారా రెట్టింపు రుణాలు ఇస్తున్నాయన్నారు. వీధి వ్యాపారులు లబ్ధిపొందిన తీరును ఈ సందర్భంగా లబ్ధిదారులు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా క్యాలెండర్లను, వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పాటల రూపంలో పాడి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారిని భాగ్యలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ భార్గవ్, డిఎస్ఓ, ఎస్బిఐ మేనేజర్ వినయ్‌చంద్ర, పిఆర్‌పి సునీత, తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు, వీధి వ్యాపారులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ఫారం 6 పై అవగాహనా సదస్సు


విద్యార్థులకు ఓటర్‌డేపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎల్లారెడ్డి(లింగంపేట్)

కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశాల మేరకు ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫారం 6పై సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రవీణ్ కుమార్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ ఓటర్ డేను పురస్కరించుకుని కార్యక్రమాన్ని నిర్వహించినట్టు పేర్కొన్నారు. చరిత్ర అధ్యాపకులు అసిస్టెంట్ ప్రొఫెసర్ జయప్రకాశ్ మాట్లాడుతూ ఓటు అనేది భవిష్యత్తు సమాజానికి నిర్మాణం చేసే ఆయుధమని విద్యార్థులకు సూచించారు. ఓటును సరియైన విధానంలో ఉపయోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల జాతీయ సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించినట్టు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కృష్ణప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో హిస్టరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జయప్రకాశ్, కామర్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.నాగనిక, కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ బుద్దె అరుణ్‌కుమార్, జాతీయ సేవా సమితి ప్రోగ్రాం ఆఫీసర్స్ కృష్ణ ప్రసాద్, గోదావరి, అధ్యాపకులు గంగారెడ్డి, సిద్దురాజు, వినయ్‌కుమార్, గోదావరి, రాణి, సంగీత, సురేష్‌రెడ్డి, మోహిన్, రామకృష్ణ, రవి కిరణ్, అలీ చౌస్, కళాశాల సూపరింటెండెంట్ వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.